

రాంరెడ్డి ఆత్మహత్య వెనుక..

# పటాన్‌చెరు బడా నేత వేధింపులు!?

## 280 ఎకరాల వెంచర్‌లో నేతల వాటాల రగడ

రియల్ ఎస్టేట్ వ్యాపారి బాణాల రాంరెడ్డి ఆత్మహత్య ఘటనలో పటాన్‌చెరులోని రియల్ ఎస్టేట్ వ్యవహారాలకు సంబంధించిన రాజకీయ జోక్యం అంశం చర్చనీయాంశంగా మారింది. ఏకంగా పటాన్‌చెరు నియోజకవర్గ బడా నేతతో పాటు అతని అనుచరవర్గం రాంరెడ్డిని మానసికంగా వేధింపులకు గురి చేశారనే ప్రచారం జోరుగా సాగుతోంది. 280 ఎకరాల వెంచర్ వ్యవహారంలో బడానేతతో పాటు అనుచరవర్గం నుండి తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు ఎదురైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాటాలు, డబ్బుల డిమాండ్లు, రైతులతో ఏర్పడిన వివాదాలు రాంరెడ్డిపై ఒత్తిడిని పెంచినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశాలపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

(ప్రత్యేక ప్రతినిధి-సిరిన్యూస్)

- బడా నేత, అనుచరవర్గం తీవ్ర మానసిక ఒత్తిడికి గురి చేసినట్లు ఆరోపణలు
- బడా నేత పాత్రపై దర్యాప్తుకు రంగం సిద్ధం?
- వాటాలు, కోట్ల రూపాయల కోసం బెదిరింపులు
- అనుమతులు రాక భారీ అప్పుల్లో కూరుకుపోయిన వ్యాపారం
- రోడ్డు అలైన్‌మెంట్లపై కొర్రీలతో వేధించిన స్థానిక నేతలు
- డెవలప్‌మెంట్ భూములను వెనక్కి ఇవ్వాలంటూ రైతుల డిమాండ్లు
- ప్లాట్లు విక్రయించాక పంచాయితీలతో తీవ్ర మానసిక క్షోభ
- ఆత్మహత్యకు ముందు ఫోన్‌లో కీలక వాయిస్ రికార్డులు
- బెదిరింపుల ఆడియోలపై దృష్టి సారించిన దర్యాప్తు బృందాలు
- బావమరిది ప్రవీణ్‌రెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు

బాధితులకు అండగా 'సిరి న్యూస్'

సంప్రదించాల్సిన నంబర్

**9989778881**

### రైతులతో వివాదం

ఆ తర్వాత మరిన్ని ఇళ్ల స్థలాల విషయంలో డిమాండ్లు వచ్చినట్లు, పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగినట్లు సమాచారం. కొందరు రైతులు డెవలప్‌మెంట్‌కు ఇచ్చిన భూములను తిరిగి ఇవ్వాలని కోరినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొన్ని స్థలాలను విక్రయించిన నేపథ్యంలో భూములను తిరిగి ఇవ్వాలన్న డిమాండ్లతో వివాదం మరింత ముదిరినట్లు సమాచారం.

### 'నివీ డెవలపర్స్' పేరుతో 280 ఎకరాల వెంచర్...

రాంరెడ్డి, భాస్కర్‌రెడ్డి కలిసి 'నివీ డెవలపర్స్' పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని చేపట్టారు. పటాన్‌చెరు ప్రాంతంలో సుమారు 280 ఎకరాల భూమిని డెవలప్‌మెంట్‌కు తీసుకుని వెంచర్ పనులు ప్రారంభించారు. ప్రాజెక్టు కోసం సొంత పెట్టుబడితో పాటు భారీగా అప్పులు చేసినట్లు తెలుస్తోంది. అయితే భూములకు సంబంధించిన న్యాయపరమైన సమస్యలు, అనుమతుల వ్యవహారాలతో ప్రాజెక్టు నిలిచిపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పెరిగినట్లు సమాచారం.

### వాటాలు, డబ్బుల డిమాండ్లపై ఆరోపణలు..

వెంచర్ వ్యవహారంలో నియోజకవర్గ బడానేతతో పాటు కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు వాటాలు, డబ్బులు ఇవ్వాలని కోరినట్లు ఆరోపణలు ఉన్నాయి. కోరిన మొత్తాన్ని పూర్తిగా ఇవ్వలేకపోవడంతో కొందరితో సర్దుబాటు జరిగినప్పటికీ, మరికొన్ని అంశాలు పరిష్కారం కాలేదని తెలుస్తోంది. అనంతరం వెంచర్‌కు సంబంధించిన రహదారి తదితర విషయాల్లో వివాదాలు తలెత్తినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో బడానేత ఒత్తిడి తీవ్రస్థాయికి చేరినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### వాయిస్ రికార్డులపై దర్యాప్తు...

ఆత్మహత్యకు ముందు రాంరెడ్డి తన ఫోన్‌లో కొన్ని విషయాలను రికార్డు చేసినట్లు పోలీసులు గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. తనపై ఉన్న ఆర్థిక, ఇతర ఒత్తిళ్లకు సంబంధించిన వివరాలు అందులో ఉన్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గ బడా నేతకు సంబంధించిన వాయిస్ రికార్డులు సైతం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. భూములు తిరిగి ఇవ్వాలంటూ ఒత్తిడి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు రైతులకు సంబంధించిన వాయిస్ రికార్డులు కూడా పోలీసుల పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఈ రికార్డుల ప్రామాణికత, వాటిలోని అంశాలు, రాంరెడ్డి ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులతో వాటికి ఉన్న సంబంధం వంటి విషయాలు దర్యాప్తులో నిర్ధారణ కావాల్సి ఉంది.

### దర్యాప్తులో తేలాల్సిన అసలు నిజాలు

భూ వివాదాలు, భారీ అప్పులు, ప్రాజెక్టు నిలిచిపోవడం వంటి అంశాలతో పాటు రాజకీయ జోక్యంపై వినిపిస్తున్న ఆరోపణలు కూడా రాంరెడ్డి ఆత్మహత్య ఘటనలో కీలకంగా మారాయి. నియోజకవర్గానికి చెందిన సదరు బడానేత వ్యవహారంతో పాటు అతని అనుచరవర్గం వల్ల దారితీసిన పూర్తి పరిస్థితులను వెలుగులోకి తీసుకురావాలని, ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నారు. రాంరెడ్డి బావమరిది కొడూరు ప్రవీణ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో వెల్లడయ్యే ఆధారాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఈ కథనంలో పేర్కొన్న రాజకీయ జోక్యం, ఒత్తిళ్లకు సంబంధించిన అంశాలు ఆరోపణలు, అనుమానాల స్థాయిలో ఉన్నవే.. వాటి వాస్తవికత దర్యాప్తులో తేలాల్సి ఉంది. అయితే ఇందుకు సంబంధించి బాధితులు ముందుకు వస్తే సిరి దినపత్రిక వెలుగులోకి తేవడానికి సిద్ధంగా ఉంది.. బాధితులు **9989778881** నంబర్‌కు సంప్రదించవచ్చు. బాధితుల సమాచారం గోప్యంగా ఉంచడం జరుగుతుంది.